




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం
మార్చి 21,2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# అభివృద్ధి అజెండా.. ఆశల బడ్జెట్




### ఉద్యోగులకు భద్రత కవచం

## నగదు రహిత వైద్యం, బీమా పథకం

- ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్‌లెస్ చికిత్స అమలు దిశగా చర్యలు
- ప్రమాద, జీవిత బీమాతో సమగ్ర రక్షణ
- 23.51 లక్షల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం



### అభివృద్ధి, సంక్షేమం

## ఆర్థిక క్రమశిక్షణకు సమాన ప్రాధాన్యం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ
- మౌలిక వసతులు, పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

## రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్

- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ హామీల అమలుకు ప్రాధాన్యం
- రైతు, మహిళ, యువత సంక్షేమం కేంద్రబిందువుగా రూపకల్పన
- పెట్టుబడుల ఆకర్షణతో తెలంగాణకు గ్లోబల్ గుర్తింపు
- విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు విస్తృత కేటాయింపులు
- పాత అప్పుల భారం తగ్గిస్తూ ఆర్థిక వ్యవస్థ పటిష్టత
- ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం లక్ష్యంగా బడ్జెట్
- రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దే దిశగా అడుగులు

హైదరాబాద్: రాష్ట్రాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా నడిపిస్తూ సంక్షేమంప్రగతి మధ్య సమతుల్యత సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దాదాపు రెండు గంటల పాటు సాగిన ప్రసంగంలో ప్రభుత్వ దృష్టికోణాన్ని వివరించారు. బడ్జెట్ అనేది కేవలం అంకెల సమాహారం కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సాధనమని ఆయన స్పష్టం చేశారు. పన్నుల రూపంలో వచ్చే ప్రతి రూపాయి ప్రజల అభ్యున్నతికే వినియోగిస్తామని, పారదర్శకతతో కూడిన పాలనను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం అభివృద్ధిసంక్షేమ మార్గంలో ముందుకు సాగిందని, గత పాలనలో ఏర్పడిన ఆర్థిక సమస్యలను సరిచేసే క్రమంలో అప్పుల పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్టు వివరించారు. అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీకి మార్చడం ద్వారా రాష్ట్రంపై ఉన్న భారం తగ్గించామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, గ్లోబల్ వేదికల ద్వారా లక్షల కోట్ల పెట్టుబడులను రప్పించిందని వెల్లడించారు. తెలంగాణను దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక గ్రోత్ ఇంజిన్‌గా నిలబెట్టే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తూ రైతు సంక్షేమం కోసం గణనీయ నిధులను కేటాయించారు. మహిళల సాధికారత కోసం అమలు చేస్తున్న

(మిగతా 2వ పేజీలో)



## మూసీపై దూకుడు..
# వెనక్కు అడుగు లేదు

- పునరుజ్జీవ ప్రాజెక్టుపై రాజీకి తావులేదని సీఎం స్పష్టం
- మొయినాబాద్ ఘటనపై భాజపా మౌనం ప్రశ్నార్థకం
- ఫోన్ ట్యాపింగ్ కేసులో వాస్తవాలు వెలికితీస్తామని హామీ
- అభివృద్ధిసంక్షేమానికి సమతూకంతో బడ్జెట్ రూపకల్పన
- ప్రతి కుటుంబానికి జీవిత బీమా.. భారీ భరోసా
- విద్యా వ్యవస్థలో మార్పులు.. టెన్ ప్లస్ టూ వైపు అడుగులు
- కేంద్ర నిధుల కోసం నిరంతర ప్రయత్నం కొనసాగుతుందని వెల్లడి
- ప్రతిపక్షాల వైఖరిపై విమర్శలు.. సహకారం కోరిన సీఎం



హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుపై ప్రభుత్వం వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు అమలులో ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అభివృద్ధి పేరుతో అవసరమైన చర్యలు తీసుకుంటామని, అయితే ప్రభావితులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. శాసనమండలి సమావేశ మందిరంలో మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో ఆయన పలు కీలక అంశాలపై స్పందించారు.

మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో జరిగిన ఘటనలపై స్పందించని భాజపా నేతల వైఖరిని సీఎం ప్రశ్నించారు. చిన్న విషయాలపైనా స్పందించే నాయకులు ఇంత పెద్ద ఘటనపై మౌనం ఎందుకు పాటిస్తున్నారని ప్రశ్నించారు. దీనివల్ల భాజపాభారాస మధ్య సంబంధాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కూడా సీఎం వివరణ ఇచ్చారు. గత పాలనలో వేల సంఖ్యలో ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ కేసులో కీలక వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో విచారణ ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం బాధితుల వాంగ్మూలాలు సేకరిస్తున్నామని, ఎవరి పాత్ర ఏంటో విచారణలో తేలుతుందని స్పష్టం చేశారు. హరీశ్‌రావుకు సంబంధించిన కేసు వేరని, దాన్ని ప్రస్తుత దర్యాప్తుతో ముడిపెట్టడం సరికాదన్నారు.

ఈ–కార్ రేస్ కేసులో ఐఏఎస్ అధికారిపై చర్యలు చట్టపరంగానే తీసుకున్నామని, విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఎవరినైనా త్వరగా శిక్షించాలని ఒత్తిడి వచ్చినా చట్టపరమైన ప్రక్రియ తప్ప మరేదీ అనుసరించబోమని తేల్చిచెప్పారు.



## గ్యారంటీలకు గండం..

### బడ్జెట్‌పై హరీశ్‌రావు ఘాటు విమర్శలు

- ఆరు హామీలను తుంగలో తొక్కారంటూ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- పింఛన్లు, మహిళల నగదు సాయం, నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదని ఆరోపణ
- కేటాయింపుల్లో కోతలు.. గ్యారంటీల అమలు సందిగ్ధంలోనని వ్యాఖ్యలు
- 'క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్, గోల్‌మాల్ మోడల్' అంటూ విమర్శలు



## శ్రీలంక దారి వైపు తెలంగాణ? : బండి సంజయ్

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్ర మంత్రి తీవ్ర ఆందోళన
- గ్యారంటీలు అమలు కాకుండా గాలిలో కలిసిపోయాయని విమర్శ
- రైతు భరోసా కేటాయింపులు తక్కువగా ఉన్నాయని ఆక్షేపణ
- అంకెల ఆర్భాటమే తప్ప ప్రయోజనం లేదని వ్యాఖ్యలు

## ఫొటోలు దిగుతుండగా గోదావరిలో విషాదం

::: ఐదుగురు యువకులు గల్లంతు, ముగ్గురి మృతి



## ఈద్ పండగరోజునే యుద్ధం తీవ్రం.. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు

- గల్ఫ్ దేశాలు లక్ష్యంగా టెహ్రాన్ ప్రతీకారం.. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగింపు
- హర్మూజ్ జలసంధిపై ఉద్రిక్తత.. ప్రపంచ ఇంధన సరఫరాపై ప్రభావం భయం
- ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు జారీ చేసిన ఇరాన్.. పర్యాటక కేంద్రాలు కూడా లక్ష్యం



# వివేకానంద మెడికల్ సెంటర్ ఆధ్యాత్మిక ఆరోగ్య నిలయం - గుండగాని మధుగౌడ్

**సంపూర్ణ ఆరోగ్యానికి భారతీయం నాచురల్ ప్రొడక్ట్స్ సరైన ఎంపిక - బండారు మనుదీప్**



హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి

హయత్ నగర్ లోని వివేకానంద మెడికల్ సెంటర్ ని సందర్శించిన ప్రముఖ రియాల్టర్, బిసి విద్యార్థి యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండ గాని మధు గౌడ్, భ్రమరాంబిక ప్రాపర్టీస్ అధినేత బండారు మణిదీప్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయం – సనాతన గృహంలో లభ్యమవుతున్న సహజ వస్తువులు, సంపూర్ణ ఆరోగ్యానికి సరైన ఎంపిక అన్నారు. పాతకాలపు నాటి ఆహారపు అలవాట్లను పరిచయం చేస్తూ నిత్య అవసర వస్తువులు అమ్మకానికి ఉంచడం, వాటి పట్ల అవగాహన కల్పించడం, ఆరోగ్యవంతమైన జీవన శైలి వైపు దారి చూపే ఈ ప్రక్రియ ఎంతో హర్షణీయమని అన్నారు.

### బండారు మనుదీప్ మాట్లాడుతూ

ప్రస్తుత సమాజంలో నిత్యవసర వస్తువులలో రసాయన పదార్థాలను కల్తీ చేస్తున్న ఉదాంతం



మనందరికీ తెలిసిందే.! తెలిసి పదేపదే జనాలు మోసపోతున్న ఈ రోజుల్లో హయత్ నగర్ లో నూనెలు, పప్పులు, సంధవ లవణం, కారం, పసుపు,మొదలైన నేరుగా ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుల నుండి మరియు సౌందర్య సాధనాలైన తలనూనెలు, సబ్బు, షాంపూలు.. అంతే కాదు పూజ సామాగ్రి కూడా శుద్ధమైనవి అంటే ఆశ్చర్యమే కదా.! కుటుంబ సమేతంగా సందర్శించవలసిన ఒక నిలయంగా చెప్పుకోవచ్చు అన్నారు.

### గుండగాని మధు గౌడ్ మాట్లాడుతూ


వివేకానంద మెడికల్ సెంటర్ ఒక క్లినిక్ ల లేదు ఒక సాంస్కృతిక ఆధ్యాత్మిక కేంద్రంగా ఉందని పేర్కొన్నారు. క్లినిక్ లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం, గో ఆధారిత సహజమైన వస్తువులు అందుబాటులో ఉంచడమే కాకుండా ఆరోగ్య ప్రదాత శ్రీ ధన్వంతరి స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షినియమని అన్నారు. శ్రీ ధన్వంతరి స్వామి దర్శనం కోసం వైద్యానికి వచ్చిన రోగులకు ఎంతో ధైర్యాన్ని చేకూరుస్తుందని అన్నారు. జిల్లాల నుంచి వచ్చే రోగులకు మెడికల్ సెంటర్ ఒక ధైర్యం అని అన్నారు. మెడికల్ సెంటర్ ఏర్పాటు చేసిన డాక్టర్ రమేష్ సాగర్ ని కొనియాడారు.

# అబ్బురపరుస్తున్న మనీష్ చిత్రాలు

**డా, రమేష్ సాగర్ కు తన చిత్రపటాన్ని అందించిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు**

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి

హయత్ నగర్ వివేకానంద మెడికల్ సెంటర్ కు తన నానమ్మను వైద్య చికిత్స కోసం తండ్రితో ఒకటి రొండు సార్లు తోడుగా వొచ్చి, పరిచయమైన డాక్టర్ గారి బొమ్మను అచ్చు గుద్దినట్టు గీసి అందరిని ఆశ్చర్యపెట్టిన ఘటన ఇది.మలక్ పేట్ వాస్తవ్యలైన శ్రీనివాస్ కుమారుడే ఈ బాలుడు. మనీష్ వయసు పదిహేను సంవత్సరములు. జి. పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్ లో విద్యనభ్యసిస్తున్నారు.విచిత్రమేమంటే ఎలాంటి ఇన్స్టిట్యూట్ లేదా గురువు మార్గదర్శం లేకుండానే ఇంతటి నైపుణ్యాన్ని సాధించాడు.ఈ కళలో ఇంకా ముందడుగు వేయాలని, ఇతిహాస పురాణ వాఙ్మయంలో ప్రస్తావించబడ్డ, ఇప్పటికీ దృశ్యరూపంలో విరివిగా దొరకని కొన్ని విశిష్టాత్మక మహనీయులకు రూపందిద్దే బృహత్కార్యాన్ని చేపట్టాలని డాక్టర్ రమేష్ సాగర్ సూచించారు. అక్కడ మనీష్ నానమ్మ చిత్తరమ్మ, చెల్లలు సుచేత మరియు తండ్రి శ్రీనివాస్ ఉన్నారు తదితరులు పాల్గొన్నారు



# ఉద్యోగులకు భద్రత కవచం

## నగదు రహిత వైద్యం, బీమా పథకం

**ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్‌లెస్ చికిత్స అమలు దిశగా చర్యలు**

**ప్రమాద, జీవిత బీమాతో సమగ్ర రక్షణ కల్పన**

**23.51 లక్షల మందికి ప్రయోజనం చేకూరే అవకాశం**

**రూ.1.25 కోట్ల ప్రమాద బీమా, అదనపు కవరేజీ ప్రతిపాదన**

**డిజిటల్ హెల్త్ కార్డుల జారీపై ప్రభుత్వ యోచన**

**ఉద్యోగ వర్గీకరణపై చర్చలు కొనసాగుతున్నాయి**

**బీమా పరిమితులు, ప్రీమియంపై ఉద్యోగుల్లో సందేహాలు**

**త్వరలో పూర్తి మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో నగదు రహిత వైద్యం, ప్రమాద బీమా, జీవిత బీమా కలిపిన సమగ్ర పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. శుక్రవారం జరిగిన బడ్జెట్ ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించింది. దేశంలోనే అరుదైన విధంగా రూపొందిస్తున్న ఈ పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగులకు రూ.1.25 కోట్ల బీమా రక్షణ కల్పించనున్నారు. అదనంగా 60 ఏళ్ల వయస్సు వరకు రూ.10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదాల్లో మరణిస్తే రూ.2 కోట్ల అదనపు కవరేజీ అందేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మొత్తం 23.51 లక్షల మంది ఉద్యోగులు, పింఛనుదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారని అంచనా. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపింది. గెజిటెడ్, నాన్ గెజిటెడ్, నాలుగో తరగతి అనే మూడు వర్గాలుగా ఉద్యోగులను విభజించే అంశం పరిశీలనలో ఉందని తెలుస్తోంది. వేతన స్థాయిని ఆధారంగా తీసుకోవడంలో సాంకేతిక సమస్యలు ఉన్నందున వర్గీకరణపై మరోసారి చర్చలు జరగనున్నాయి. నగదు రహిత వైద్యం అమలుపై ఉద్యోగుల్లో ఆసక్తితో పాటు కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చికిత్స ఖర్చులకు పరిమితి ఉంటుందా? కుటుంబానికి మొత్తం కవరేజీ ఇస్తారా? లేక వ్యక్తిగతంగా పరిమితులు విధిస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక కుటుంబంలో పలువురు సభ్యులు ఉంటే బీమా ఎలా వర్తిస్తుందనే అంశంపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు. పథకం అమల్లో భాగంగా ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసే యోచన ఉంది. ఇప్పటి వరకు అమలులో ఉన్న రీయింబర్స్‌మెంట్ విధానాన్ని పూర్తిగా తొలగించి, ఆస్పత్రుల్లో నేరుగా నగదు రహిత చికిత్స అందించే విధంగా మార్పులు తీసుకురానున్నారు. ఇక, ఈ పథకం కోసం ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతం మొత్తాన్ని వసూలు చేసే ప్రతిపాదన కూడా ఉంది. అయితే అన్ని కేటగిరీలకు ఒకే విధంగా వర్తింపజేస్తారా? లేక వర్గాల వారీగా భిన్న విధానాలు ఉంటాయా? అన్న దానిపై చర్చలు కొనసాగుతున్నాయి. పథక నిర్వహణలో ఆరోగ్యశ్రీ ట్రస్టు పాత్ర పరిమితంగా ఉండగా, మిగిలిన వ్యవహారాలను ఉద్యోగుల ట్రస్టు పర్యవేక్షించే అవకాశం ఉందని సమాచారం. ఈ అంశాలన్నింటిపై ప్రభుత్వం త్వరలోనే పూర్తి స్థాయి మార్గదర్శకాలు జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది.




# అభివృద్ధి, సంక్షేమం.. ఆర్థిక క్రమశిక్షణకు సమాన ప్రాధాన్యం

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ**

**మౌలిక వసతులు, పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు**

హైదరాబాద్: తెలంగాణ కొత్త బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణను సమన్వయం చేస్తూ ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో 202627 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆయన రాష్ట్ర భవిష్యత్ దిశను వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత పాలనలో ఏర్పడిన ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ పరిపాలనను సక్రమ మార్గంలో తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. పాత అప్పులు, వాటి వడ్డీలను చెల్లిస్తూనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని వివరించారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సవాళ్లను విసురుతున్నప్పటికీ తెలంగాణ వృద్ధిరేటు మెరుగ్గా కొనసాగుతోందని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025' ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించామని, దావోస్ వేదికగా కొత్త విధానాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని భవిష్యత్ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని సమగ్రంగా తీసుకెళ్లేందుకు పట్టణాలు, నగరాలను సమానంగా అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టామని వెల్లడించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, కొత్త రిజర్వాయర్లు, మౌలిక వసతుల విస్తరణ ద్వారా నగరాభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని వివరించారు.

భవిష్యత్ నగరంగా రూపొందిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్నట్టు తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారులు, భూగర్భ విద్యుత్ వ్యవస్థలు, పర్యావరణ అనుకూల సదుపాయాలతో ఈ ప్రాజెక్టు అభివృద్ధికి కొత్త దిశ చూపుతుందని చెప్పారు.

ప్రజా సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని అమలు చేస్తున్న పథకాలు పేదల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం బ్యాంకుల ద్వారా భారీ రుణాల పంపిణీ, గృహ, విద్యుత్, జీవనోపాధి పథకాల ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని పెంచుతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో నిలవడంలో ప్రభుత్వ ప్రోత్సాహం కీలకమని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు మద్దతు చర్యలు, రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలతో గ్రామీణాభివృద్ధి బలోపేతమవుతోందని వివరించారు. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కూడా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పర్యాటక రంగ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గోదావరి పుష్కరాలను సమర్థంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సామాన్యుడిపై అదనపు భారం మోపకుండా, ఉన్న వనరులను సమర్థంగా వినియోగిస్తూ కొత్త సంపదను సృష్టించడం ప్రభుత్వ ఆర్థిక విధానమని భట్టి స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కాకుండా రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు

**శ్రీ భ్రమరాంబిక ప్రాపర్టీస్ సి. ఎండి బండారు మనీదీప్**



ఎల్ బి నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి

పవిత్ర రంజాన్(ఈద్–ఉల్–ఫితర్) పండుగ సందర్భం గా భ్రమరాంబిక ప్రాపర్టీస్ సి.ఎండి బం డారు మనుదీప్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదర, సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరితో సంతో షంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా బండారు మనీదీప్ అన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలతో ఆధ్యాత్మిక చింతన పెంచుకునే ఈ పండుగ.. సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ముస్లింలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మా భ్రమరాంబికా ప్రాపర్టీస్ హైదరాబాద్ కు అతి చేరువలో ఉన్న అత్యంత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం మహేశ్వరం సెజ్ కు అతి సమీపంలో పేద, మధ్యతరగతి ప్రజలు ఇన్వెస్ట్ చేసేలా మా కంపెనీ కృషి చేస్తుందని అన్నారు

## మూసీపై దూకుడు.. వెనక్కు అడుగు లేదు

'ఇందిరా కుటుంబ జీవ బీమా' పథకాన్ని ప్రవేశపెట్టామని, దాదాపు 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల భీమా వర్తిస్తుందని తెలిపారు. విద్యా రంగంలో కూడా సంస్కరణలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా మార్పులు తీసుకువస్తామని, ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు ఒకే విద్యాసంస్థలో విద్య అందించే విధానం అమలు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఇంటర్మీడియట్ వ్యవస్థ ప్రాముఖ్యత తగ్గే అవకాశం ఉందని సూచించారు. మూసీ ప్రాజెక్టుపై ప్రతిపక్షాల విమర్శలను ఆయన ఖండించారు. అభివృద్ధి కావాలంటే అడ్డంకులను తొలగించాల్సిందేనని, రహదారి విస్తరణలో ఇబ్బందులు తొలగించినట్లే ఇక్కడ కూడా చర్యలు తప్పవని అన్నారు. ఇప్పటికే 21 కిలోమీటర్ల మేర డీపీఆర్ సిద్ధమైందని, మొత్తం ప్రాజెక్టు నివేదిక పూర్తయ్యాక కేంద్రానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ గత ప్రభుత్వ అప్పుల భారం ఇంకా కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు భారీ మొత్తంలో రుణాలు చెల్లించాల్సి వచ్చిందని, అయినప్పటికీ ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

## అభివృద్ధి అజెండా.. ఆశల బడ్జెట్

పథకాలు ఆర్థికంగా వారికి మేలు చేస్తున్నాయని, ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీల ద్వారా కోట్ల రూపాయల ఆదా కలిగిందని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా నైపుణ్యాభివృద్ధి, విద్యా రంగాలపై దృష్టి పెట్టామని, ఇప్పటికే వేలాది ఉద్యోగ నియామకాలు చేపట్టినట్టు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను సమ్మిళిత అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మౌలిక వసతుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. భవిష్యత్ నగరాల నిర్మాణం, రవాణా అనుసంధానం, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మొత్తంగా ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించే సంకల్ప పత్రంగా నిలుస్తుందని, పేదల నుంచి మధ్యతరగతి వరకు ప్రతి వర్గానికి ఉపయోగపడే విధంగా రూపొందించామని భట్టి స్పష్టం చేశారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగని ప్రభుత్వం భావిస్తోంది.

## ఈద్ పండగరోజునే యుద్ధం తీవ్రం..

దుబాయ్ : పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. ఇజ్రాయెల్అమెరికా సంయుక్త దాడులకు ఎదురుదెబ్బలు తగులుతున్నప్పటికీ, ఇరాన్ మాత్రం వెనక్కి తగ్గే లక్షణాలు చూపించడం లేదు. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై కూడా అది క్షిపణులు, డ్రోన్లతో వరుస దాడులు కొనసాగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా శత్రుదేశాల్లోని పర్యాటక కేంద్రాలు, వినోద ప్రదేశాలపై కూడా దాడులకు దిగుతామని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పవిత్ర 'ఈద్ ఉల్ ఫితర్' పండగరోజున కూడా దాడులు ఆగలేదు. సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై దాడికి ప్రతీకారంగా ఇరాన్ భీకర దాడులు జరుపుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తి మేరకు, ఆ గ్యాస్ క్షేత్రాన్ని ఇకపై లక్ష్యంగా చేసుకోబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. మరోవైపు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు అమెరికా చర్యలు ప్రారంభించింది. ఇరాన్ తన సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లోని మినా అల్ అహ్మదీ రిఫైనరీపై డ్రోన్లతో రెండు విడతలుగా దాడులు జరపడంతో అక్కడ భారీ మంటలు చెలరేగాయి. ఈ రిఫైనరీ రోజుకు 7.3 లక్షల బ్యారెళ్ల చమురును శుద్ధి చేసే సామర్థ్యం కలిగి ఉంది. దుబాయ్ వైపు దూసుకొచ్చిన ఇరాన్ డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకోవడంతో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. సౌదీ అరేబియా ఈస్టర్న్ ప్రావిన్స్‌పై దాడికి వచ్చిన డ్రోన్లను కూడా అక్కడి బలగాలు కూల్చివేశాయి. బహ్రెయిన్‌పైకి వచ్చిన క్షిపణిని కూడా అడ్డుకోవడంతో, దాని శకలాలు ఒక గిడ్డంగిపై పడటంతో మంటలు చెలరేగాయి. ఇజ్రాయెల్‌పైకి కూడా ఇరాన్ క్షిపణులు దూసుకెళ్లాయి. జెరూసలెం ఓల్డ్ సిటీ సమీపంలో పేలుళ్లు సంభవించగా, ఇద్దరు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అల్ అక్సా మసీదును మూసివేశారు. 1967 తర్వాత ఈద్ సందర్భంగా మసీదు మూసివేయడం ఇదే తొలిసారి. ప్రపంచవ్యాప్తంగా శత్రుదేశాల్లోని పార్కులు, పర్యాటక ప్రాంతాలు సురక్షితం కావని ఇరాన్ సైనిక ప్రతినిధి జనరల్ అబొల్‌ఫజల్ షెకార్చీ హెచ్చరించారు. యుద్ధాన్ని ముగించేందుకు ప్రపంచ దేశాలు అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఒత్తిడి తేవాలని ఇరాన్ వ్యూహం అని విశ్లేషకులు భావిస్తున్నారు. పక్క దేశాలకు కూడా ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. తమపై దాడులకు అమెరికా స్థావరాలను ఉపయోగించనివ్వకూడదని పేర్కొంది. ఒకవేళ అలా జరిగితే ఆ దేశాలు కూడా యుద్ధంలో భాగమవుతాయని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఇరాన్‌లో నౌరోజ్ పండగ వేడుకలు యుద్ధం కారణంగా మసకబారాయి. టెహ్రాన్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.

# కాప్రా ప్రెస్ క్లబ్ లో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం

**సభ్యులకు 2016 ఉగాది నగదు పురస్కారం**

**క్లబ్ నుంచి ప్రతినెల ఈఎస్ఐ చెల్లింపు**

**60 లక్షల రూపాయల వ్యక్తిగత భీమా**



క్యాలెండర్ ప్రకటనల ద్వారా నిధుల సేకరణ కాప్రా, మార్చి 19 : కాప్రా ప్రెస్ క్లబ్ లో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు శ్రీధర్ పంతులు ఉగాది పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఉగాది సందర్భంగా క్లబ్ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 2016 నగదు పురస్కారాన్ని అందజేయడం జరిగింది. మొత్తం 23 మంది సభ్యులకు రూ. 46368 నగదు అందజేయడం జరిగింది. క్లబ్ సభ్యులందరికీ ప్రతినెల ఈఎస్ఐ ప్రీమియం క్లబ్ ఆధ్వర్యంలోనే చెల్లించాలని నిర్ణయించారు. 60 లక్షల రూపాయల వ్యక్తి యొక్క బీమా పాలసీని చెల్లిస్తామన్నారు . ఏటా రెండు సార్లు 53 రకాల ఆరోగ్య పరీక్షలు, క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టూ వీలర్ ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, హెల్మెట్, రైన్ కోట్ అందజేస్తామన్నారు. ఉగాది తెలుగు క్యాలెండర్ ముద్రించి వచ్చిన నిధులతో సభ్యులకు ఈ పథకాలను అమలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ సలహాదారులు బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులు యావాపురం రవి, దిలీప్ కుమార్, దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్, కె.వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ,వి.రవి, మహమ్మద్ ఫిరోజ్, మాజీ అధ్యక్షుడు పటేల్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఈటల రాజేందర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ యువ నాయకులు

కల్వకుర్తి మార్చి 20 వార్త మిర్రర్ ప్రతినిధి:- మల్కాజ్ గిరి ఎంపీ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ జన్మ దిన సందర్భంగా బీజేపీ యువ నాయకుడు బొల్గం దివాకర్ గౌడ్ నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.వారితో పాటు బీజేపీ యువ నాయకులు అరవింద్ గౌడ్.శ్రీను సాగర్.గణేష్ తదితరులు ఉన్నారు

# ఘనంగా ప్రపంచ పిచ్చుకల, ప్రపంచ అడవి దినోత్సవం





వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 20

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లిపూర్ లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం, ప్రపంచ అడవి దినోత్సవం ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్లిపూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శాంబయ్య హాజరై, పక్షుల సంరక్షణ, అడవుల పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేందర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించి, విద్యార్థుల్లో ప్రకృతి ప్రేమను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గూళ్లు తయారు చేయడం, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రమాదేవి, ఫారెస్ట్ సిబ్బంది, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, వసంతరావు, లక్ష్మి, రాజశేఖర్, మహేష్, ఆనంద్, రాజన్న, రతిలాల్, బాలమురళి రజిత, మల్లారెడ్డి, శంకరయ్య, కృష్ణ ప్రసాద్, జీవన్ రెడ్డి లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రాయికల్ మండల స్పోర్ట్ స్కూల్ సెలెక్షన్స్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 20జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4 వ తరగతి స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్ కొరకు విద్యార్థిని విద్యార్థులకు తొమ్మిది ఈవెంట్లు , స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగు, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, ఎత్తు, బరువు, షటిల్ రన్, ఫ్లెక్సీబులు టెస్ట్ , లను నిర్వహించినట్లు ఎం ఈ ఓ రాఘవులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు గుర్రం శ్రీనివాస్ తో పాటు నిర్వహణలో పిడి లు కృష్ణ ప్రసాద్, గంగాధర్, రాజగోపాల్, రమేష్ లు పాల్గొన్నారు. ఇందులో అర్హత సాధించిన వారు ఈ నెల 31 వ తేదీన జగిత్యాల లోని వివేకానంద మినీ స్టేడియం లో జరిగే జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూలు సెలెక్షన్స్ లో పాల్గంటారు.

# నిధులు ఉన్నాయి.. హద్దులు చూపండి

**రోడ్డు పనులు నిలిచిపోవడంతో తహసీల్దార్‌కు వినతిపత్రం**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 20

మంజూరైన నిధులు ఉన్నప్పటికీ భూమి సరిహద్దుల వివాదంతో రోడ్డు పనులు నిలిచిపోవడంతో మైతాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి పనులు పూర్తిచేయాలని కోరుతూ రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మైతాపూర్ గ్రామంలోని శ్రీ గిరిగుట్ట (గన్నేగుట్ట)పై సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయానికి మెయిన్ రోడ్డునుంచి సిమెంట్ రహదారి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు దామోదరరావు తన నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ, మధ్యలో భూమి పట్టాదారులు అడ్డుపడటంతో పనులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. భూమి సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో వివాదం నెలకొన్నదని, రెవెన్యూ శాఖ అధికారులు, సర్వే అధికారులు గ్రామానికి వచ్చి సరిహద్దులు నిర్ణయిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. లేనిపక్షంలో మంజూరైన నిధులు వినియోగం కాకుండా తిరిగి వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిగుట్టపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి పరిసర గ్రామాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భక్తుల రాకపోకలకు అనుకూలంగా వెంటనే రహదారి నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో భూమి సరిహద్దుల సమస్యను తక్షణమే పరిష్కరించి రహదారి పనులు పూర్తి చేయాలని వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, తొగిటి నవీన్,అనుమల్ల రమ,బూస గంగామల్లయ్య, భూపల్లి పరమేష్, స్థానిక నాయకులు సత్యనారాయణ కలిసి తహసీల్దార్‌ను కోరారు.



# వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రం ఆవిష్కరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 20

విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ సంయుక్తంగా రాయికల్ లో ఈనెల 29 నాడు నిర్వహించే కార్యక్రమం సంబంధించిన కరపత్రం హనుమాన్ దేవస్థానం ప్రాణంగంలో ఆవిష్కరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, పార్టీల కతీతంగా ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహింద పరిషత్ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ కైతి గంగాధర్, బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ జిల్లా సాప్తాయ్ మిలాల్, విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలోమండల సంయోజక్ గుండేటి పంచాయతీ రాఘవ కురుసంగా వేణు, ప్రఖండ సంయోజక్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఫాల్గుణ మాసం విదియ సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు.

**అమ్మ వారికి ముడుపు సమర్పణ**



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 20

జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో తేదీ: 20.03.2026, ఫాల్గుణ మాసం, శుక్ల పక్షం, శుక్రవారం విదియ పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం, అమ్మ వారి ప్రసాదం, తాంబూలం ప్రసాదం, ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించడం జరిగినది. తదనంతరం అమ్మ వారికి ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు వడ్లగట్ట స్వాతి, రజిత, ప్రసన్న, వనజ, గంగవ్వ, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# ఉగాది ప్రీమియర్ లీగ్ సీజన్ 5 విజేతగా సేవాలాల్ మహారాజ్ 11 స్టార్స్

వార్త మిర్రర్ మహేశ్వరం ప్రతినిధి మార్చి 20..

నాగిరెడ్డి పల్లి లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మొదటి బహుమతి 15000/- ట్రోఫీ. రెండొవ బహుమతి 10000/- ట్రోఫీ. ఉగాది పండగ సందర్భంగా నాగిరెడ్డి పల్లి పరిధిలోని నిర్వహించిన క్రికెట్ పోటీలో 4 గ్రామాపంచాయతీ క్రికెట్ టీంలు పాల్గొనడం జరిగింది ఇందులో ఫైనల్ లో పులిమత్త టీం పై ఘనవిజయం సాధించిన నాగిరెడ్డిపల్లి తండా సేవాలాల్ మహారాజ్ 11 స్టార్స్..

# కాంగ్రెస్ , మజ్లిస్ పార్టీలు దొందూ దొందే.

**బీజేపీ పార్టీ కో-ఆపరేటివ్ రాష్ట్ర సెల్ కన్వీనర్, కొలను శంకర్ రెడ్డి**



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 20 : కాంగ్రెస్ పార్టీ మజ్లీస్ పార్టీలు దొందు దొందే అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు ఆయన బడంగపేట్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభ సందర్భంగా శాసనసభలో జాతీయ గీతం వందేమాతరం ఆల్ అవతరణ జరుగుతుండగా ఎంఐఎం సభ్యులు బైకాట్ చేయడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా తప్పుపడుతుందని మతోన్మాద శాసనసభ్యులను శాశ్వతంగా, బహిష్కరించాలని మజిలీస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం గుర్తింపును ఎలక్షన్ కమిషన్ రద్దు చేసే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని శంకర్ రెడ్డి అన్నారు. మజ్లీస్ పార్టీకి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వారిపైచర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆందోళనకు పిలుపునివ్వవలసి వస్తుందని హెచ్చరించారు, అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రకారం, మన జాతీయ గీతాన్ని వందేమాతర గీతాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని, అలా కాకుండా మజిలీస్ పార్టీ వారు ఇటీవల అసెంబ్లీలో వందేమాతర గీతం ఆలాపన జరుగుతున్న సమయంలో బైకాట్ చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ చర్య దేశం పట్ల వారికి ఉన్న గౌరవం పై ప్రశ్నలను లేవనెత్తుతుందని. అసలు వీరి విధేయత ఎవరి పట్ల ఉంది అని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ సాక్షిగా వారి నాయకులు జై పాలస్తీనా అనినాదాలు చేసిన తీరును దేశ ప్రజలు ఎలా మరిచిపోతారని వ్యాఖ్యానించారు కాగా మజిలీస్ ఎమ్మెల్యేల వైఖరి సిగ్గుచేటు అని ఈ చర్య భారతమాత ఆత్మ కు జాతీయ గేయానికి జరిగిన అవమానమని శంకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు, ఈ విలేకరుల సమావేశంలో దేశపాక జగన్, రాకేష్, కృష్ణ, మహేశ్వర్ రెడ్డి రామిడి మహేందర్ రెడ్డి, ఎస్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా దాసరి రవీందర్ జయంతి వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మార్చి 20

సీనియర్ జర్నలిస్టు స్వర్గీయ దాసరి రవీందర్ జయంతి వేడుకలను శుక్రవారం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి రవీందర్ తల్లిదండ్రులు దాసరి గంగాధర్, దాసరి సత్తమ్మ, రవీందర్ సతీమణి దాసరి సరిత, కుమారుడు సహర్ష్, కూతురు శృతి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, భోగ రవి ప్రసాద్, మోర సుమన్, మోర రామ్మూర్తి, గన్నె రాజిరెడ్డి, కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,మాజీ కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి, వల్లకొండ మహేష్ , ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్, కోశాధికారి జగదీశ్వర్, సీనియర్ పాత్రికేయులు నాగమల్ల శ్రీకర్, గంగాధరీ సురేష్,రసూల్,తీగుళ్ల గోపి,గట్టుపెల్లి నరేష్, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు వెంటనే నెరవేర్చాలి

**- బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్**

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 20 : రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు పిలుపు మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ మరియు జనరల్ సెక్రెటరీ ఎలిమిటి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీ లు అమలు చేయలేక 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కి రెండున్నర సంవత్సరాలు అయినా నెరవేర్చకపోవడంతో శుక్రవారం కలెక్టర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్ తో పాటు మాజీ అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డి రాష్ట్ర,జిల్లా,మండల, నాయకులతోపాటు సర్పంచులు, మరియు హైదరాబాద్ జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు, మీర్పేట్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, జనరల్ సెక్రెటరీ ఇంద్రావత్ రవి నాయక్, ధ్యాసాన్ని తిరుపతిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిల్లా నాయకులు, కరుణానిధి, నీలా రవి నాయక్, విజయలక్ష్మి రాజు ముదిరాజ్, శ్రావణ్ కుమార్, మొక్క నరేంద్ర కుమార్, పెండ్యాల నరసింహ, భీమ్ రాజ్, మన్యం రవీందర్ రెడ్డి వైస్ ప్రసిడెంట్ లతాశ్రీ బెల్లంకొండ నాగరాజ్ బూత్ సాయి నాయకులు శక్తి కేంద్ర ఇన్చార్జిలో, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# హాష్ ఆయిల్ ను విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎస్ఓటి పోలీసులు.....

మాదాపూర్ వార్త మిర్రర్ :

అక్రమంగా హష్ ఆయిల్ను విక్రయిస్తున్న వ్యక్తిని మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన కథనం ప్రకారం ... కర్నూల్కు చెందిన పరుసముల దినేష్ (28) కైతలాపూర్లో నివాసం ఉంటు మెకానిక్గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో హష్ ఆయిల్ను విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ నెల 19వ తేదీన మద్యాహ్నం 12:35 గంటల సమయంలో మాదాపూర్లోని అయ్యప్ప సొసైటీలో ఓ వ్యక్తికి అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు హుటాహుటీన అక్కడకు చేరుకొని నిందితున్ని అదుపులోకి తీసుకోని స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. దీంతో పోలీసులు నిందితున్ని విచారించగా అరకు నుండి హష్ ఆయిల్ను తీసుకువచ్చి అందులో రసాయానాలు కలిపి 10 లీటర్లకు బదులుగా 30 లీటర్లు తయారు చేసి 5 ఎంఎల్ చొప్పున బాక్సో పెట్టి హైదరాబాద్లోని పలువురికి రూ. 2 వేల నుండి 3 వేల వరకు విక్రయిస్తున్నాడు. అనంతరం నిందితుడి వద్ద రాయల్ ఎన్ఫీల్డ్ దిచక్ర వాహనం 1, మొబైల్ 1, రూ.4.5 నుండి 5.లక్షల10 వెయ్యిల రూపాయలు విలువైన 1215 గ్రాముల 184 బాక్సు హష్ అయిల్ను స్వాధీనం చేసుకొని ఎన్ఎపిఎస్ చట్టం ప్రకారం... కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.




# మియాపూర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్,యలమంచి ఉదయ్ కిరణ్..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ. రేవంత్ రెడ్డి క్రీడా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమని, యువత క్రీడల్లో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శుక్ర వారంరోజున మియాపూర్ మెట్రో గ్రౌండ్లో నేటి నుండి 22వ తేదీ వరకు నిర్వహించబడనున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యువతతో కలిసి ఉత్సాహంగా క్రికెట్ ఆడుతూ వారిని క్రీడల పట్ల ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన నాయకులు వీరేందర్ గౌడ్, కావూరి ప్రసాద్, యలమంచి ఉదయ్ కిరణ్, పట్వారీ శశిధర్, కట్ల శేఖర్ రెడ్డి, రాజధర్మ రెడ్డి, రాజి రెడ్డి, బిఎస్ఎన్ సాయి, రాంచందర్ గౌడ్, వాసు, సంగమేష్, రమేష్, శ్రీనివాస్ ముదిరాజ్, బలింగ్ సురేష్ గౌడ్, సాయి యాదవ్, ప్రియదర్శిని, దివాకర్ రెడ్డి, రవి కుమార్, రత్నాచారి, శరత్, రాధాకృష్ణ, ప్రవీణ్, సతీష్, కామినేని వాసు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాహిత బడ్జెట్‌కు మోతే శ్రీలత శోభన్ రెడ్డి హర్షం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాహిత దృక్పథంతో రూపొందించబడిందని గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని ఆమె తెలిపారు. శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం రాష్ట్ర అభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. సుమారు రూ.3.35 లక్షల కోట్లకు పైగా ఉన్న ఈ బడ్జెట్ గత సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన పెరుగుదలతో ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా ఉందని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉండటం సంతోషకరమని, ముఖ్యంగా కళ్యాణ లక్ష్మి పథకం కింద ఆర్థిక సహాయాన్ని పెంచే ప్రతిపాదన మహిళల ఆర్థిక భద్రతకు తోడ్పడుతుందని



తెలిపారు. అలాగే ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), పెన్షన్ల పెంపు, రైతు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి నిర్ణయాలు సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేస్తాయని ఆమె పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్న నిర్ణయం విద్యార్థుల సంక్షేమానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్ రంగాలకు అధిక నిధులు కేటాయించడం ద్వారా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు. శాఖల వారీగా కేటాయింపులు సమతుల్యంగా ఉండి రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తాయని, ముఖ్యంగా విద్య, వ్యవసాయం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ ప్రజల సంక్షేమం, సామాజిక సమానత్వం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా రూపొందించబడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా అనుకూల నిర్ణయాలకు తన సంపూర్ణ మద్దతు ఉందని మోతే శ్రీలత శోభన్ రెడ్డి స్పష్టం చేశారు.




# మెట్టుగూడలో రంజాన్ తోఫాల పంపిణీ

సికింద్రాబాద్, మార్చి 20 (వార్త మిర్రర్): పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మెట్టుగూడలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ సూచనల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు ర్యాల రాజేందర్ యాదవ్ లబ్ధిదారులకు తోఫా కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ రంజాన్ పండుగ త్యాగం, సహనం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పేద ప్రజలు కూడా పండుగను ఆనందంగా జరుపుకునేలా తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాహేదా బేగం, ఆషా, భరణి, జకీర్ తదితరులు పాల్గొన్నారు.




## ఎయిర్ ఇండియా చేసిన పెద్ద పొరపాటు..

## 13 గంటలు ప్రయాణించి, మధ్యలోనే తిరిగి వచ్చిన విమానం..!

ఢిల్లీ నుంచి కెనడా వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ప్రయాణ మధ్యలోనే యూ–టర్న్ తీసుకుని ఢిల్లీకి తిరిగి రావాల్సి వచ్చింది. విమానయాన సంస్థ చేసిన ఈ తప్పిదం వల్ల వందలాది మంది ప్రయాణికులకు అసౌకర్యం కలగడంతో పాటు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఇంధనం వృథా అయింది. ప్రయాణికులు చిక్కుకుపోయారు.ఎయిర్ ఇండియా చేసిన పెద్ద పొరపాటు.. 13 గంటలు ప్రయాణించి, మధ్యలోనే తిరిగి వచ్చిన విమానం..!ఢిల్లీ నుంచి కెనడా వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం ప్రయాణ మధ్యలోనే యూ–టర్న్ తీసుకుని ఢిల్లీకి తిరిగి రావాల్సి వచ్చింది. విమానయాన సంస్థ చేసిన ఈ తప్పిదం వల్ల వందలాది మంది ప్రయాణికులకు అసౌకర్యం కలగడంతో పాటు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. విమాన ప్రయాణానికి ముందు చేయాల్సిన ప్రాథమిక అనుమతి తనిఖీని నిర్వహించకపోవడం వల్ల 13 గంటల విమాన ప్రయాణం వృథా అయింది. ఇంధనం వృథా అయింది. ప్రయాణికులు చిక్కుకుపోయారు.



# ఐ ఎన్ టి ఎస్ ఓ పరీక్షల్లో చందానగర్ శ్రీచైతన్య స్కూల్ విద్యార్థుల ఘన విజయం....

చందానగర్ వార్త మిర్రర్ : శ్రీ చైతన్య చందానగర్ విద్యార్థులు 2025–26 అకాడమిక్ సంవత్సరంలో మరో విజయాన్ని కైవసం చేసుకున్నారు . ఈ సంవత్సరానికిగాను జరిగిన ఐ.ఎన్.టి.ఎస్.ఓ (×ట్మీయా) పరిక్షల్లో విజేతలుగా నిలిచారని స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఈ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. మొదటి నిలిచిన ప్రైజ్ విజేతగా 6వ తరగతి విద్యార్థి జి.తరుణ్ సాయి ట్యాబ్ (గెలుచుకున్నాడు).టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నాడు. బ్రాంచ్ మొత్తులో 54 మంది ! విద్యార్థులు స్వర్ణ పతకాలు మరియు ఇతర బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి జోన్ ఏజీఎం శివరాదుకృష్ణ, ఆర్ ఐ పద్మజ, హైస్కూల్ జోనల్ కోఆర్డినేటర్ వెంకట శివ, ప్రైమరీ కోఆర్డినేటర్ అన్నపూర్ణ . ప్రిన్సిపాల్ లక్ష్మీ దీప్తి, జాన్ ఉమా శ్రీను, ప్రైమరీ ఇన్చ్ళ్ళ ఇంచార్జ్ విశాలి తదితరులు పాల్గొన్నారు..

# అడ్రస్ అడిగి మహిళా మెడలో పుస్తెలతాడు చోరీ



వార్త మిర్రర్ ,కల్వకుర్తి:

ఊరుకొండ పేటకు ఎలా వెళ్లాలని అడ్రస్ అడిగి మహిళా మెడలో మంగళ సూత్రాన్ని అపహరించిన సంఘటన కల్వకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎముక జంగమ్మ (55 ),తన భర్తతో కలిసి గొర్రెలను మేపడానికి పోలానికి వెళ్ళింది. సాయంత్రం 6 గంటల సమయంలో గొర్రెలను కొట్టుకొని గ్రామానికి వస్తుండగా, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్ పై నాపమల్లయ్య కోళ్ల ఫారం దగ్గరకు ఎదురుగా వచ్చి ,ఊరుకొండ పేట గ్రామానికి బాట ఎక్కడా అని అడగగా, ఇక్కడి నుండి వెళ్లండని బాటను చూపిస్తుండగా, వెనుక కూర్చున్న వ్యక్తి అకస్మాత్తుగా పుస్తెలతాడు, పట్టిలను పట్టి లాగాడు. వెంటనే ఆమె కింద పడిపోవడంతో తాడు తెంపుకొని దొంగలు పరారయ్యారు. మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు , తులం నర పట్టీలు అపహరించినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమారు బంగారం విలువ 8 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. కల్వకుర్తి ఎస్.ఐ మాధవరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




## హైదరాబాద్ లో కల్తీ ఆహారంపై పోలీసుల ఉక్కుపాదం

## హైదరాబాద్ ఫుడ్ అండ్ సెక్యూరిటీ టాస్క్ ఫోర్స్ బృందం రంగంలోకి

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి

హైదరాబాద్ వాసులకు కల్తీ ఆహారం నుంచి రక్షణ కల్పించేందుకు హైదరాబాద్ పోలీసులు (హైదరాబాద్ ఫుడ్ అండ్ సెక్యూరిటీ టాస్క్ ఫోర్స్) పేరుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. 28 మంది సభ్యులతో కూడిన ఈ బృందం హోటళ్లు,తినుబండారాల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి,ఆహార భద్రత ప్రమాణాలను తనిఖీ చేస్తుంది.ఆహార నాణ్యతలో లోపాలు కనిపిస్తే వెంటనే 87126 61212 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. ప్రజల ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని,నాణ్యమైన ఆహారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు

# గ్యాస్ సిలిండర్ల కొరతతో సామాన్యులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు... రాజు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ మార్చి 20..

దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా కనిపిస్తోందని తార్నాక డివిజన్ కు చెందిన రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ పరిస్థితి సామాన్య ప్రజలతో పాటు చిన్న వ్యాపారులను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది వినియోగదారులు బుకింగ్ చేసినప్పటికీ సరఫరా ఆలస్యం అవుతోందని,ఈ నేపథ్యంలో బ్లాక్ మార్కెట్ పెరిగి, సిలిండర్ల ధరలు అమాంతం పెంచి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు వంటి చిరు వ్యాపారులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, సాధారణంగా లభించే కమర్షియల్ సిలిండర్ దొరకకపోవడంతో, వారు బ్లాక్ మార్కెట్‌లో ఒక్క సిలిండర్‌కు రూ.4,000 నుండి రూ.7,000 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది . కొన్ని ప్రాంతాల్లో ఇది రూ.5,000 పైగా కూడా పెరిగిందన్నారు.గ్యాస్ కొరత కారణంగా అనేక హోటళ్లు ధరలు పెంచడం లేదా వంటకాల పరిమాణం తగ్గించడం వంటి చర్యలు తీసుకుంటున్నాయి . మరికొన్ని చోట్ల వ్యాపారులు తాత్కాలికంగా దుకాణాలు మూసివేయాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది.ఇక గ్యాస్ సరఫరాలో లోటు ఏర్పడటానికి మధ్యప్రాచ్య దేశాల్లో జరుగుతున్న సంఘర్షణల ప్రభావం ప్రధాన కారణంగా చెప్పబడుతోంది. ఈ కారణంగా ఎల్పీజీ దిగుమతులు దెబ్బతిన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది . మరోవైపు, గృహ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కమర్షియల్ వినియోగదారులకు సరఫరా తగ్గినట్లు తెలుస్తోంది .ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో తనిఖీలు నిర్వహించి అనేక సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు . గ్యాస్ కొరత సమస్యను వెంటనే పరిష్కరించాలని, చిన్న వ్యాపారులకు ప్రత్యేక కోటా కేటాయించాలని ప్రజలు, వ్యాపార వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే వారి జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు.

